క్లుప్తంగా

కౌలు రైతులంతా సీసీఆర్‌సీ కార్డులు పొందాలి

పెదపాడు: మండలంలోని కౌలు రైతులంతా కౌలు కార్డులు పొందాలని ఏడీఏ వై సుబ్బారావు తెలిపారు. మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో కౌలురైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ సుబ్బారావు మాట్లాడుతూ రైతుల సంతకాలను నిర్ధేశించిన పత్రంపై తీసుకుని సాగు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సాగు కార్డు వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. వి.ప్రదీప్‌కుమార్, ఆదినారాయణ పాల్గొన్నారు.

రామ్మోహనరావు సేవలు మరువలేనివి


కనక రామ్మోహనరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పెదవేగి: వైఎస్సార్‌సీపీ కుటుంబానికి కనకయ్య చేసిన సేవ మరువలేనిదని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదకడిమిలో పర్వతనేని నరేంద్ర తండ్రి కనక రామ్మోహనరావు సంతాప సభ బుధవారం ఆయన స్వగృహంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కనక రామ్మోహనరావు చిత్రపటానికి పూలమాలలు వేసిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి నివాళులర్పించారు. అనంతరం పర్వతనేని కనక రామ్మోహనరావు చిత్రపటం వద్ద రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, రాష్ట్ర వడ్డీల కార్పొరేషన్ డైరెక్టర్ మండల కొండలరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఈ-కేవైసీ నమోదు

దెందులూరు: మండలంలో అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఈకేవైసీ నమోదు కార్యక్రమం వేగవంతంగా జరుగుతుందని దెందులూరు మండల వ్యవసాయ శాఖాధికారి గద్దె రమేష్‌బాబు అన్నారు. బుధవారం దెందులూరు మండల వ్యవసాయ కార్యాలయంలో ఆయన విలేకరులక వివరాలను వెల్లడింఆచరు. గ్రామ వ్యవసాయ అసిస్టెంట్లు, రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. దెందులూరులోని రైతు భరోసా కేంద్రంలో జరుగుతున్న ఈకేవైసీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి సూచనలు చేశారు.

జగనన్న సురక్ష పథకం అమలుపై అవగాహన

పెదపాడు: జగనన్న సురక్ష పథకాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలని దెందలూరు ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్ తెలిపారు. పెదపాడు మండలంలోని కొక్కిరపాడు గ్రామంలో వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం ఏర్పాటు చేసి జగనన్న సురక్ష పథకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ అక్కినేని గోపీ చంద్ర దుర్గాప్రసాద్, జిల్లా రైతు మిల్లర్ల సంఘం అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి మాట్లాడుతూ ప్రజలకు అర్హత కలిగిన పథకాలు అందించడంలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో కొక్కిరపాడు సర్పంచ్ మరీదు రెడ్డియ్య, వీఆర్వో పుట్టా అజయ్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు సక్రమంగా నిర్వహించాలి

దెందులూరు: ఉపాధి పనులు వేగవంతంగా లక్ష్యాలకు అనుగుణంగా పూర్తి చేయాలని జాతీయ ఉపాధి హామీ పథకం దెందులూరు మండల ఏపీఓ దశరథ రామ్‌జీ అన్నారు. బుధవారం చల్లచింతలపూడిలో సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ శ్రావణ్‌తో కలిసి అమృత సరోవర్ పథకంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. మస్తర్లు పరిశీలించారు. పనులపై ఆరా తీశారు. టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు సమన్వయం, ప్రణాళికతో ఉపాధి హామీ పథకం లక్ష్యాలు సాధనకు కృషి చేయాలన్నారు.

నేడు లక్ష్మీపురంలో గడపగడపకు మన ప్రభుత్వం

పెదవేగి: మండలంలోని లక్ష్మీపురంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని మండల సచివాలయాల కన్వీనర్ కేశన సతీష్ బుధవారం విలేకరులకు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభమయ్యే స్థానిక ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి పాల్గొని ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

డీవైఈఓ పోస్టు మంజూరుపై హర్షం

దెందులూరు: ప్రతి రెవెన్యూ డివిజన్ ఒక ఉపవిద్యాశాఖాధికారి (డీవైఈఓ) పోస్టును మంజూరు చేస్తూ జీఓ విడుదల చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్‌టీఎఫ్ కృతజ్ఞతలు తెలిపింది. పరిపాలనా వికేంద్రీకరణ, పాలనా సౌలభ్యం, ఉద్యోగులు, ఉపాధ్యాయుల అభివృద్ధి, సౌకర్యం దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం స్వాగతిస్తున్నామని వైఎస్సార్ సీపీ టీఎఫ్ దెందులూరు నాయకులు రాబర్ట్, దాసు అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.


గణపవరం ప్రభుత్వ డిగ్రీకాలేజీలో యోగా విన్యాసాలు చేస్తున్న విద్యార్థినులు


గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగాసనాలను క్యాడట్స్‌తో వేయిస్తున్న ఎన్‌సీసీ అధికారి భీమేశ్వరరావు



పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవం చేస్తున్న దృశ్యం

యోగాసనం.. ఆరోగ్య భాగ్యం

- పెరుగుతున్న ఆదరణ
- సంపూర్ణ ఆరోగ్యానికి సాధనం


ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న డా.లక్ష్మీసౌజన్య


కొవ్వలి ఉన్నత పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు


కొప్పాకలో యోగా సాధన చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ప్రపంచానికి యోగాను అందచేసిన ఘనత భారతదేశానిదేనని నారాయణపురం ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డా. టికె విశ్వేశ్వరరావు అన్నారు. బుధవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ పురాతన కాలంనుంచి మునులు యోగులు యోగా ఆసనాలు ద్వారా జీవితం ఆనందంగా నూరేళ్ల గడిపారని దీని ప్రాముఖ్యతను ప్రపంచం గుర్తించడం ఎంతో సంతోషమదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొగ్రం ఆఫీసర్ జి నిర్మల, డి. రెడ్డయ్య, డా. కొండ రవి, అధ్యాపకలు పాల్గొన్నారు. ప్రతి రోజు యోగా చేస్తే ఆరోగ్యం మీవెంటే ఉంటుందని ఉంగుటూరు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి డా . లక్ష్మీ సౌజన్య అన్నారు. బుధవారం ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డా. లక్ష్మీ సౌజన్య మాట్లాడుతూ యోగా చేయడం వల్ల జ్ఞాపక శక్తి విద్యార్థుల్లో పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు యోగా చేయడం వల్ల బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. సర్పంచ్ బండారు సింధు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు యోగా చేయాలని కోరారు. యోగా చేయడం ఆరోగ్యానికి ఎంతో మంచిదన్నారు. ఈసమావేశంలో యోగా శిక్షకులు మందజయలక్ష్మి, కాటి రాజేష్, పివిపి రాజు లు విద్యార్థులచే యోగా విన్యాసాలు చేయించారు. ఈకార్యక్రమంలో డా. మీరాసాహెబ్ (చెట్టన్నపాడు), డా. హరిశ్రీనివాసు (హోమియో)కండవల్లి ప్రభుత్వ వైద్యులు పాల్గొన్నారు. యోగాసీనియర్ అభ్యాసకుకుల కొరిపల్లి వెంకట అప్పారావు, నంద్యాల రామన్న తదితరులు పాల్గొన్నారు.

యోగాతోనే ఆరోగ్యం

గణపవరం: ఆరోగ్యమే మహాభాగ్యమని, మంచి ఆరోగ్యం కావాలంటే నిత్యం యోగా చేయాలని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గణపవరం మండల వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు,పిహెచ్‌సిలలో యోగాదినోత్సవం నిర్వహించారు. యోగాతో రోగాలకు దూరంగా ఉండవచ్చునని ప్రతీ రోజూ కొంత సమయాన్ని యోగాకు కేటాయించడం ద్వారా ఆరోగ్య వంతులుగా ఉండవచ్చునని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి అన్నారు. గణపవరం ఎంపీడీవో జ్యోతిర్మయి, ఎంఈవోలు పుచ్చల శేషు, గొర్రెల బాలయ్య తదితరులు యోగా దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఏకాగ్రత, మానసిక ధృఢత్వం యోగా వల్లే సాధ్యం

భీమడోలు: మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని పలువురు యోగా నిపుణులు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాల, అన్నేవారి గూడెం యూపీ పాఠశాలల్లో యోగా డే సందర్భంగా చిన్నారులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. పలువురు చిన్నారులు యోగాసనాలను వేసి అబ్బుర పర్చారు. గుండుగొలనులో పీడీ, ఎన్‌సీసీ అధికారి కేజీ భీమేశ్వరరావు ఆధ్వర్యంలో పాఠశాలలోని 44 మంది ఎన్‌సీసీ విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. అన్నేవారిగూడెంలో హెచ్ఎం ఎస్‌కే మస్తాన్ ఆధ్వర్యంలో మన ఆరోగ్యం మన చేతుల్లో అనే నినాదంతో గ్రామంలో చిన్నారులు, ఉపాధ్యాయులు కలిసి పురవీధుల్లో ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. గుండుగొలను నెం.1 పాఠశాలలో హెచ్ఎం పాశం పాండురంగారావు ఆధ్వర్యంలో టీచర్లు చిన్నారులకు యోగాసనాలు నేర్పారు. ఈ కార్యక్రమాల్లో హెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

పెదవేగిలో..

పెదవేగి: యోగాతో మంచి జీవన విధానం అలవడుతుందని కొప్పాక ఆయుర్వేద వైద్యశాల అధికారిణి దుర్గాభవాని అన్నారు. మండలంలోని కొప్పాక ఉన్నత పాఠశాల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కొప్పాక ఆయుర్వేద వైద్యాధికారిణి దుర్గాభవాని, డాక్టర్ ఉమామహేశ్వరిల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ దీక్షితులు ముఖ్య అతిథిగా యోగా విశిష్టతను తెలిపారు. అనంతరం నిర్వహించిన వైద్య శిబిరంలో 500 మంది ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం గవరరాజు, పీడీ శ్రీనివాసరావు, సిబ్బంది పేర్సిమణి, ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, ఏఎస్ఎం దయామణి పాల్గొన్నారు. విజయరాయి ఉన్నత పాఠశాల్లో హెచ్ఎం ఎం వెంకటరమణ, పీడీ మారగాని మల్లికార్జున్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. సచివాలయ కార్యదర్శి సౌజన్య, ఉపసర్పంచ్ లేగల శివ, విద్యాకమిటీ చైర్మన్ బైగాని రంగారావు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయాలి


భీమడోలులో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, సీనియర్ నాయకులు

భీమడోలు: జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. భీమడోలు ప్రజా సంఘాల కార్యాలయంలో బుధవారం ఈనెల 30వ తేదీన తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని చింతలపూడి, తాడిపూడి ఎత్తి పోతల పథకాల వంటి సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గోదావరి, కృష్ణా కాల్వలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించి నీటి ప్రవాహం శివారు ప్రాంతాలకు చేరేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు, కౌలు రైతులకు సార్వా పంట రుణాలను ఇవ్వాలని, వడ్డీ రాయితీ పథకాన్ని రూ.2లక్షల వరకు, పావలా వడ్డీ పథకాన్ని రూ.5లక్షల వరకు పెంచాలన్నారు. అయిల్‌ఫామ్ గెలల ధర టన్నుకు రూ.20వేలు వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జి.ప్రసాదరావు, సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, గుర్రం రాంబాబు, కౌలు రైతుల సంఘం జిల్లా కో కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల మానసిక ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి


పూళ్ల పీహెచ్‌సీలో గర్భిణులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

భీమడోలు: మహిళల మానసిక ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని జిల్లా మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ కె.హన్నా కోమలి అన్నారు. పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం గర్భిణులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సును నిర్వహించారు. గర్భిణులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించి అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేశారు. మానసిక స్థితిని దెబ్బతినే సమస్యలు, వారిని సాధారణ స్థితికి తీసుకుని వచ్చేందుకు రోగులకు అవగాహన కల్పించారు. అనంతరం ఉచితంగా మందులను అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు బి.లీలా ప్రసాద్, కల్యాణి మహేశ్వరీ, ఎంపీహెచ్ఈవో కిషోర్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి


మొయ్యేరులో వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా ఎస్పి రవిప్రకాష్

గణపవరం: ప్రాణాలకన్నా విలువైనది ఏదీ లేదని, ప్రాణ రక్షణకు ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పశ్చిమగోదావరి జిల్లా ఎస్పి రవిప్రకాష్ అన్నారు. బుధవారం రాత్రి గణపవరం ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు సిబ్బందితో కలిసి గణపవరం మండలం మొయ్యేరు గ్రామంలో పెట్రోలు బంకు వద్ద హెల్మెట్ డ్రైవ్ నిర్వహించారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో ఆమార్గంలో వెళ్తున్న జిల్లా ఎస్పీ హెల్మెట్ ధరించని వాహనదారులకు ఎస్సై అవగాహన కల్పిస్తుండగా ఆయన అక్కడ కారు దిగి హెల్మెట్ ఉపయోగంపై వాహనదారులకు అవగాహన కల్పించారు. మీకోసం, మీకుటుంబ సభ్యులు క్షేమం కోసం హెల్మెట్ ధరించాలని హెల్మెట్ ధరిస్తే ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం ఉండదని అన్నారు.

కాశిపాడులో ఆక్రమణల తొలగింపు

గణపవరం: మండలంలోని కాశిపాడు గ్రామంలో ఆక్రమణలు తొలగించాలన్న హైకోర్టు ఆదేశాలతో బుధవారం పంచాయతీ, రెవెన్యూ, పోలీసు అధికారులు ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఏళ్ల తరబడి గ్రామంలోని వెంకమ్మ చెర్వుగట్లు, శ్మశాన వాటిక ప్రాంతాల్లో పలువురు ఆక్రమించుకుని ఇళ్లు పశువుల పాకలు వేసుకున్నారు. ఈవిషయమై గతంలో ఎన్నోసార్లు ఆక్రమణలు తొలగించాలని చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇటీవల హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో రెండు ప్రాంతాలలో సుమారు 166 ఆక్రమణలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిలో 60 మంది ఇళ్లు నిర్మించుకుని నివాసాలు ఉంటుండగా, మిగిలిన వారు ఆక్రమిత స్థలాలలో పశువుల పాకలు, గడ్డివాములు వంటివి వేసుకోగా, కొందరు ఇతర అవసరాలకు వినియోగించుకుంటున్నట్లు గుర్తించారు. హైకోర్టు ఆదేశాలతో బుధవారం అధికారులు ఆక్రమణల తొలగింపుకు ఉపక్రమించారు. ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు రాకుండా పటిష్ఠ పోలీసుబందోబస్తు ఏర్పాటు చేశారు. రెవెన్యూ, మండల పరిషత్, పంచాయతీ అధికారులతోపాటు అంబులెన్స్‌ను, అగ్నిమాపక వాహనాన్ని సిద్ధంగా ఉంచారు. అయితే ఆక్రమణదారుల్లో సుమారు 103 మంది హైకోర్టు నుంచి స్టే తెచ్చుకోవడంతో వాటిని మినహాయించి, మిగిలిన వాటిని అధికారులు తొలగించారు. ఎంపీడీవో జ్యోతిర్మయి, తహసీల్దార్ పమ్మి లక్ష్మి, ఎస్ఐ వేముల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం

భీమడోలు: సర్కారీ బడులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అమోఘమని పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా అన్నారు. పోలసానిపల్లి నెం.1, నెం.2 ప్రాథమిక పాఠశాలల్లో చదువుకుంటున్న బాలబాలికలకు జగనన్న విద్యా కానుక కిట్లను బుధవారం సర్పంచ్ షేక్ రహీమాబేగం హసేనా, ఎంపీటీసీ అంబటి దేవీ నాగేంద్రప్రసాద్‌ల చేతుల మీదుగా పంపిణీ చేశారు. రెండు పాఠశాలలోని సుమారు 70 మంది చిన్నారులకు జాతీయ పాఠ్యపుస్తకాలు, యూనిఫారమ్, బెల్ట్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్థాయి బడులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి పాఠశాలకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు కె.తులసి, మోహనరావు, పేరెంట్స్ కమిటి చైర్మన్ మామిడి రాటాలు, పాల్గొన్నారు.

జగనన్న సురక్షను విజయవంతం చేయాలి

ఉంగుటూరు: ప్రజల సమస్యల పరిష్కారం కోసం జూలై ఒకటి నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉంగుటూరు మండల ప్రత్యేకాధికారి వెంకటరమణ అన్నారు. బుధవారం ఉంగుటూరు ఎంపీడీవో సమావేశపు హాల్‌లో ప్రజాప్రతినిధులు, అధికార్లకు జగనన్న సురక్షపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎల్ డివో రమణ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించే విధంగానే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందన్నారు. అర్హులైనప్పటికి ఇంకా సంక్షేమ పథకాలు అందని వారెవరైనా ఉంటే వారికి అందేలా చేసే బాధ్యత వలంటీర్లు, గృహ సారథులదేనన్నారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి మాట్లాడుతూ వలంటీర్లు మరింత బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, వైసీపీ సచివాలయాల మండల కన్వీనర్ పెనుగొండ బాలకృష్ణ, వైసీపీ పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాలగోపి, ఎంపీడీవో అణు, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భీమడోలులో చోరీ

భీమడోలు: భీమడోలులోని ఓ ఇంట్లో బుధవారం తెల్లవారుజామున జరిగిన చోరీలో ఏడు కాసుల బంగారు అభరణాలు, కొంత నగదును అపహరణకు గురయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. భీమడోలు గణపతి సెంటర్‌లోని ఇంటి యాజమాని ఈతకోట సత్యకృష్ణ, కుటుంబ సభ్యులు ఉక్కపోతను తట్టుకోలేక కింద పోర్షన్లలో మంగళవారం రాత్రి నిద్రపోయారు. ఉదయాన్నే సత్యకృష్ణ పైపోర్షన్‌కు వెళ్లి చూడగా తలుపునకు వేసిన తాళం పగులకొట్టి ఉండడాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై చావా సురేష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఇంట్లో బీరువాలో ఉండాల్సిన ఏడు కాసుల బంగారు ఆభరణాలను దొంగిలించారని, అదే విధంగా కొంత నగదు అపహరించారని బాధితుడు సత్యకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జత గాజులు, గొలుసు, మూడు ఉంగరాలు, లాకెట్ ఉన్న గొలుసును దొంగిలించారన్నారు. భీమడోలు హెచ్‌సీ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాం


ఓ మహిళ సమస్యను వింటున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి: ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచామని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. భారీ ఈదురుగాలులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నిర్వహించిన కార్యక్రమానికి అడుగడుగునా ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి, చేస్తున్న అభివృద్ధి గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతాంగాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా దాదాపు 600 హామీలను మేనిఫెస్టోలో పెట్టుకుని ఏ ఒక్క హామీని నెరవేర్చని చరిత్ర చంద్రబాబుదని గుర్తు చేశారు. ప్రతి విషయంలో రైతులకు పెద్దపీట వేశామని, గతంలో రైతు రుణమాఫీ పేరుతో అన్నదాతను టీడీపీ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని ఎమ్మెల్యే విమర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, ఎంపీపీ తాతా రమ్య కుమార్, సొసైటీ అధ్యక్షుడు పెనుమాక వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు మేకా గంగాధర రావు, జిల్లా వ్యవసాయశాఖ సలహా మండలి సభ్యురాలు చోడిశెట్టి ప్రభావతి, మేకా వసంత్, చోడిశెట్టి వెంకటేశ్వరరావు, బెజవాడ వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ సొంగ సోమేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ తాళం వెంకటేశ్వరరావు, సుబానీ, మస్తాన్, కాసిం, మోతీ, జగదీష్, పరసా వరలక్ష్మి పాల్గొన్నారు.

కుష్టు నివారణ అందరి బాధ్యత

గణపవరం: కుష్టువ్యాధిని సమూలంగా నిర్మూలించి, కుష్టురహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. బుధవారం గణపవరం పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది, ఎఎన్ఎంలు. ఎంపిహెచ్‌డబ్ల్యు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లకు కుష్టువ్యాధి గుర్తింపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుంచి వచ్చేనెల 17వ తేదీ వరకూ కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమం జరుగుతుందని, వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి కుష్టువ్యాధి లక్షణాలను వివరించి, వ్యాధిగుర్తింపు కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి కిరణ్మయి, సీహెచ్‌వో జాలాది విల్సన్, ఆరోగ్యసహాయకుడు యోహాన్ పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

కంభం స్వామినాథం అప్పనవీడు గ్రామం, పెదపాడు మండలం, తాళ్ళమూడి రెవిన్యూ డివిజన్, రి.స.నెం. 11-2 రూలో చ.గ. 508 నివేస స్థలము దస్తావేజు నెం .2472/1990 ఒరిజినల్ దస్తావేజు ఇంటి వద్ద నుండి పట్నూరు వెళ్ళుచుండగా మార్గమధ్యములో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది ఫోన్ నెంబరు తెలియజేయగలరు.
సెల్ : 72879 16913

నేడు భీమడోలులో మినీ జాబ్ మేళా

భీమడోలు: భీమడోలు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఈనెల 22వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు మినీ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.మధుసూధనరావు అన్నారు. భీమడోలులో బుధవారం ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ, నేషనల్ కెరీర్ సర్వీసెస్, జిల్లా ఉపాధి కల్పనాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ ప్రైవేటు సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసుకునేందుకు ఈ జాబ్ మేళాను నిర్వహిస్తామన్నారు. 8వ తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ వంటి కోర్సులు పూర్తి చేసుకుని 18 నుంచి 35 ఏళ్ల లోపు యువతీ యువకులు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. మోహన్ స్పిన్ టెక్స్ 80 పోస్టులను ఖాళీగా ఉన్నాయన్నారు. వారికి రూ.8వేల నుంచి రూ.12వేల వరకు వేతనం ఇస్తారన్నారు. మాక్స్ సెక్యూరిటీలో 140 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ముత్తూట్ ఫైనాన్స్‌లో డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంకామ్ పూర్తి చేసుకున్న వారికి ఉన్నతాధికారి పోస్టులు ఉన్నాయని, అర్హత సాధిస్తే వారికి ఏడాదికి రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వేతనం ఇవ్వడం జరుగుతుందని సెట్‌వెల్ సీఈవో మెహరాజ్, ఎన్‌సీఏ జిల్లా కోఆర్డినేటర్ ప్రవీణ్ కృష్ణలు తెలిపారు

ఫైనాన్షియల్ లిటరసీలో విద్యార్థినుల ప్రతిభ

దెందులూరు: రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా నిర్వహించిన ఆల్ ఇండియా క్విజ్ ఆన్ ఫైనాన్షియల్ లిటరసీ- 2023 అంశంపై పోటీలు బుధవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ పోటీల్లో దెందులూరు పాఠశాల విద్యార్థినులు శలాది నాగవెంకట అపర్ణ, తాబేలు లక్ష్మి అత్యంత ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం పొందారు. విద్యార్థినులను హెచ్ఎం పి.శ్రీదేవి, ఎంఈఓ-1 సీహెచ్ బుద్ధవ్యాస్ అభినందించారు.